పకడ్బందీగా పరీక్ష నిర్వహించాలి

■ జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ■ రేపు గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్

రంగారెడ్డి, జూన్ 7(నమస్తే తెలంగాణ): గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ జూన్ 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి చేపట్టాల్సిన విధి విధానాలపై ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఐడెంటిఫికేషన్ అధికారులు, పరీక్ష నిర్వహణ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష నిర్వహణకు 93 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 55 వేల 692 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. రూట్ ఆఫీసర్లు, రీజనల్ కోఆర్డినేటర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఐడెంటిఫికేషన్ అధికారులు, లైజన్ అధికారులు పూర్తి బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులను ఉదయం 9 నుంచి 10 గంటల వరకు అనుమతిస్తామని, ఆ తరువాత వచ్చే వారిని అనుమతించరాదని తెలిపారు. రూట్ అధికారులు తమ లోకేషన్లను ముందస్తుగానే చూసుకోవాలని, వివిధ శాఖల అధికారులు పరీక్షా కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పర్యవేక్షించాలన్నారు. ఐడెంటిఫికేషన్ అధికారులు అభ్యర్థి యొక్క హాల్ టికెట్, ఫొటోను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌తోపాటు టీజీపీఎస్సీ రీజనల్ కోఆర్డినేటర్ గిరిధర్, సైబరాబాద్ ఏసీపీ మురళికృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

పాల్గొన్న సంబంధిత అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

ఎలాంటి పొరపాట్లు జరుగొద్దు

వికారాబాద్, జూన్ 7 : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష సజావుగా జరిగేలా అధికారులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి చేపట్టాల్సిన విధి విధానాలపై ఐడెంటిఫికేషన్ అధికారులు, శాఖ పరమైన అధికారులు, పరీక్ష నిర్వహణ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులకు మౌలిక వసతుల కల్పనకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు ప్రణాళికతో పరీక్ష నిర్వహణకు కృషి చేయాలని ఆదేశించారు. పరీక్ష సమయంలో తప్పులు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. పూర్తి పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌తో పాటు టీజీపీఎస్సీ రీజనల్ కోఆర్డినేటర్ రాజేశ్ పాల్గొన్నారు.



మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి

పర్యావరణ పరిరక్షణ కృషి చేయాలి

రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి

చేవెళ్లరూరల్, జూన్ 7 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం చేవెళ్ల మండల మల్కాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాయు కాలుష్యంతో జనజీవనం సతమతమవుతుందన్నారు. విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శివరాజ్, మల్కాపూర్ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు యాదిరెడ్డి, నరేందర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యుడు అశోక్, పురాన్‌దాస్, ఇంద్రసేనారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహులు, రమేశ్‌గౌడ్, రమేశ్, జబ్బార్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూన్ 7 : 2024-25 సంవత్సరం అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్ శిక్షణ పొందేందుకు లా గ్రాడ్యుయేట్ పూర్తిచేసుకున్న బీ.సీ. కులాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని వెనుకబడిన కులాల అభివృద్ధి అధికారి కే. ఉపేందర్ పేర్కొన్నారు. అభ్యర్థులు రాష్ట్ర చట్టం కింద స్థాపించబడిన విశ్వవిద్యాలయం లేదా కేంద్ర విద్యాలయం గ్రాంట్స్ కమిషన్ గుర్తించిన విద్యా సంస్థల నుంచి లా డిగ్రీ పొంది ఉండాలని సూచించారు. అభ్యర్థి వయసు జులై 23 నాటికి 23 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థి తల్లిదండ్రులు, సంరక్షకుల ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షలు మించి ఉండరాదన్నారు. బార్ కౌన్సిల్ లో తమ పేరు నమోదు చేసుకుని ఉండాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు మూడు సంవత్సరాల పాటు అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్‌లో శిక్షణ పొందాలని, ఈ మూడు సంవత్సరాలకు గాను ఆర్థిక సాయం కల్పించబడుతుందని పేర్కొన్నారు. శిక్షణ పొందు కాలంలో నెలకు వెయ్యి రూపాయల చొప్పున ఉపకార వేతనం చెల్లించబడుతుందని ఆయన చెప్పారు. అడ్వకేట్ గా నమోదు చేసుకునేందుకు రూ.585 రుసుమును చెల్లించబడుతుందని, లా పుస్తకాలు, ఫర్నిచర్ కొనుగోలుకు రూ.3వేల చెల్లించనున్నట్లు తెలిపారు. శిక్షణ కోసం జిల్లా న్యాయస్థానంలోని ప్రభుత్వ న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు అనుబంధం చేయనున్నట్లు ఆయన తెలిపారు. జూన్ 10 నుంచి జిల్లా వెనుకబడిన కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చన్నారు. అభ్యర్థులు పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్, స్థానిక, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, లా డిగ్రీ ప్రొవిజినల్‌తో పాటు కౌన్సిల్ కన్సాలిడేట్ ధ్రువీకరణ పత్రాలతో జూన్ 25వ తేదీలోగా వికారాబాద్ కలెక్టరేట్‌లోని వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తుల సమర్పించాలని కోరారు.

వికారాబాద్ డైట్ కళాశాలలో..

ప్రభుత్వ డైట్, ప్రైవేటు డీ.ఈఎల్.ఈడీ కళాశాలలో ప్రవేశాల కోసం జూన్ 6 నుంచి జూన్ 30 వరకు దరఖాస్తులు చేసుకోవాలని వికారాబాద్ డిస్ట్రిక్ట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ట్రేనింగ్ (డైట్) ప్రిన్సిపాల్ కె.రామాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-26 రెండు సంవత్సరాల డీ.ఈఎల్ కోర్సు తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ మీడియాల్లో చేరడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష జూలై 10న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష కంప్యూటర్ బేస్డ్ (ఆన్‌లైన్ మోడ్) ద్వారా నిర్వహిస్తారన్నారు. పరీక్షకు హాజరయ్యే ఓసీ, బీసీ అభ్యర్థులు ఇంటర్మీడియట్‌లో 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబర్ 1,2024 నాటికి 17 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాలకోసం hhtp://deecet.cdse.telangana. gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవాల్సిందిగా ప్రిన్సిపాల్ తెలిపారు.

త్వరగా పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- జిల్లాలోని 930 పాఠశాలలకు రూ.50 కోట్లు కేటాయింపు
- 66శాతం మరమ్మతు పనులు పూర్తి
- 5లక్షల 50వేల పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు పంపిణీ
- బడీడు పిల్లలను బడుల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపించాలి
- ఈ నెల 12వరకు స్కూళ్లను సిద్ధం చేయాలి
- మంబాపూర్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమం
- పాల్గొన్న జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

మంబాపూర్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న జిల్లా విద్యాధికారి రేణుకా దేవి

పెద్దేముల్, జూన్ 7: కార్పొరేట్‌స్థాయిని తలదన్నేలా సర్కారు బడులను తీర్చిదిద్ది సిద్ధం చేయనున్నట్లు జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. శుక్రవారం మంబాపూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. అనంతరం చేపట్టిన ర్యాలీలో పాల్గొని విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి పాఠశాలలో చేర్పించాలన్నారు. అంతకుముందు మరమ్మతుల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రేణుకాదేవి మాట్లాడుతూ గ్రామాల్లో బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 930 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో తాగునీరు, మూత్రశాలలు, కరెంట్, ఇతర మరమ్మతుల కోసం కలెక్టర్ చొరవతో రూ.50 కోట్లను కేటాయించారు. 66శాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాకు 5 లక్షల 50వేల పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, అభ్యాసన దీపికలు, వర్క్‌బుక్‌లతోపాటు త్వరలో ఒక జత యూనిఫాంను అందిస్తామన్నారు. ఈ నెల 12 వరకు అన్ని పాఠశాలలను సిద్ధం చేయాలని కమిటీలు, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సర్కారు బడుల్లోనే విద్యార్థులను చేర్పించి నాణ్యమైన, గుణాత్మకమైన, సమర్థవంతమైన విద్యను అందించి జీవితంలో ఎదిగేటట్లు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామంలో విద్యార్థుల ఇంటికి వెళ్లి వారిని పాఠశాలల్లో చేర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటయ్య, పాఠశాల హెచ్ఎం రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు సిహెచ్. చంద్రయ్య, శ్రీనివాస్, ఊర్మిళ, బాలమణి, హెచ్ఎం కె.శ్రీనివాస్, ఏఏపీసీ చైర్మన్లు మంజుల, జ్యోతి, సెక్టోరియల్ ఆఫీసర్లు రజిని, రాంకిషోర్, ఏఎంవో రామ్ మస్తా, సిబ్బంది శేఖర్, శ్రీకాంత్, ఎస్ఎంసీ చైర్మన్ ఏసు, సీఆర్పీ సుధీర్, ఏపీఎం బాలయ్య, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సంగీత, రాజశేఖర్, అంగన్‌వాడీ టీచర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి విత్తనాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకుంటున్న మండల వ్యవసాయ శాఖ అధికారి తులసి, పోలీసులు

అధిక ధరకు పత్తి విత్తనాల విక్రయం

వ్యక్తిపై కేసు నమోదు చేసిన పోలీసులు

చేవెళ్లరూరల్/చేవెళ్లటౌన్, జూన్ 7 : వ్యవసాయ శాఖ నిర్ధేశించిన ఎమ్మార్పీ రేట్లకు పత్తి విత్తనాలు విక్రయించకుండా అధిక ధరకు అమ్మిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మండల వ్యవసాయ శాఖ అధికారి తులసి, సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని ఎన్కేపల్లి ఎక్స్ రోడ్డులో శ్రీ సాయి ఏజన్సీస్ షాపు నిర్వాహకుడు ఈగ లక్ష్మారెడ్డి పత్తి విత్తనాలను ప్రభుత్వం నిర్ధేశించిన ఎమ్మార్పీ రేటు ప్యాకెట్ రూ.864కు విక్రయించకుండా రూ.950కు విక్రయిస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారంతో ఏవో తులసి, పోలీస్‌లు ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిర్వాహకుడు ఈగ లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి తులసి మాట్లాడుతూ.. రైతులు ఎమ్మార్పీ రేట్లకే విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే తమకు సమాచారం అందిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏవో వెంట మండల వ్యవసాయ విస్తరణాధికారి రమేశ్, పోలీసులు ఉన్నారు.

ఆశవర్కర్లను తొలగిస్తే ఊరుకోం

కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులకు వినతిపత్రం అందజేస్తున్న బాలరాజ్, ఆశవర్కర్లు

కందుకూరు, జూన్ 7 : రాష్ట్ర ప్రభుత్వం కుంటి సాకులు చెప్పి కొంత మంది ఆశవర్కర్లను తొలగించాలని చూస్తుందని, ఆశా వర్కర్లను తొలగిస్తే ఊరుకునేది లేదని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాలరాజ్ అన్నారు. మండల పరిధిలోని ఆశవర్కర్లతో కలిసి శుక్రవారం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లను యథావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు ప్రభుత్వం నిర్వహించే పరీక్షలను రద్దుచేయాలని కోరారు. రూ.18వేల వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, రూ.5లక్షల ప్రమాద బీమాను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్లు జయసుధ, ముంతాజ్, ప్రేమలత, అనిత, సురేఖ, భాగ్య, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్స్ సకాలంలో అందించాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 7 : విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌ను సకాలంలో అందించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు కుట్టిన స్కూల్ యూనిఫామ్స్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు ఆయన అందజేసి మాట్లాడుతూ.. మంచి డిజైన్‌లతో స్కూల్ యూనిఫామ్స్‌ను మహిళా సంఘాల సభ్యులు కుట్టినట్లు వారిని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ ను సకాలంలో అందించాలని.. వాటిలో మార్పులు, చేర్పులుంటే చేయాలన్నారు. జిల్లాలో యూనిఫామ్స్ కుట్టేందుకు రూ.1.20 కోట్లు కుట్టు కూలి కింద ఖర్చు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 10తేదీలోపు యూనిఫామ్స్‌ను బడులకు చేర్చాల ని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, అదనపు డీఆర్డీవో సరోజ, డీపీఎంలు రామ్మూర్తి, నర్సింహులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏక రూప దుస్తులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్న కలెక్టర్, అధికారులు

అవగాహనలేమి వైద్యం ప్రాణాలకు ముప్పు

మంబాపూర్ గ్రామంలో ఆర్ఎంపీ డాక్టర్ శ్రీనివాస్ క్లినిక్ తనిఖీ

సీజ్ చేసిన జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్‌యాదవ్

పెద్దేముల్, జూన్ 7 : మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో ఉన్న ఆర్ఎంపీ శ్రీనివాస్ క్లినిక్‌ను శుక్రవారం తనిఖీ చేసి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్ యాదవ్ సీజ్ చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో ఆర్ఎంపీ డాక్టర్ శ్రీనివాస్ కొన్ని రోజులుగా క్లినిక్‌ను నడిపిస్తున్నాడు. మండల పరిధిలోని చైతన్యనగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అంజిలయ్య మంబాపూర్ గ్రామంలోని ఆర్ఎంపీ శ్రీనివాస్ క్లినిక్‌లో తన పాదం మడిమకు నొప్పి ఉందని వెళ్లగా ఆర్ఎంపీ శ్రీనివాస్ ఆయనకు రెండు ఇంజక్షన్లు ఇచ్చాడు. ఈ ఇంజక్షన్లతో నరం సచ్చుబడి అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో అంజిలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్‌యాదవ్ శుక్రవారం మంబాపూర్ గ్రామంలో ఆర్ఎంపీ శ్రీనివాస్ క్లినిక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి క్లినిక్‌లో రకరకాల మందులు నిల్వ చేయడంతోపాటు తన వైద్యంతో సామాన్య ప్రజలను అనారోగ్యానికి గురి చేస్తున్నాడని గుర్తించి శుక్రవారం అతడి క్లినిక్‌ను సీజ్ చేశారు. అవగాహనలేమి వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రవీందర్‌యాదవ్ హెచ్చరించారు.

శ్రీనివాస్ క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారులు

పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బిక్కును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

యాచారం, జూన్ 7 : పోలీస్‌స్టేషన్‌లో పెట్రోల్ పోసుకొని ఓ గిరిజన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతూ హల్‌చల్ చేశాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం..మండలంలోని మంథన్‌గౌరెల్లి గ్రామానికి చెందిన సభావత్ బిక్కు అనే గిరిజన వ్యక్తికి అదే గ్రామానికి చెందిన కొంత మందికి కొన్నేండ్లుగా భూవివాదం కొనసాగుతున్నది. భూమి తనదంటే తమదేనని ఇరువురి మధ్య పంచాయితీ నడుస్తుంది. భూమి విషయం మాట్లాడుకోవడానికి కొంత మంది గ్రామ పెద్దలతో కలిసి యాచారం వచ్చాడు. భూమికి సంబంధించిన అంశం మాట్లాడుతుండగా, తనకు న్యాయం జరుగడంలేదని పోలీస్‌స్టేషన్‌లోకి దూసుకెళ్లి తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. భూ వివాదంపై కోర్టును ఆశ్రయించాలని పోలీసులు అతడికి సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినందుకు గాను పోలీసులు సభావత్ బిక్కుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12వ తేదీ నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 7 : ఉస్మానియా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్‌లో ఈ నెల 12వ తేదీ నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఏ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతి రోజూ ఉదయం 6:30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5:30 నుంచి 7 గంటల వరకు వేర్వేరుగా ప్రత్యేక బ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 9985856507, 9849752655 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎంపీఈడీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 18వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 20వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ పరిధిలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎంబీఏ (నాన్ సీబీసీఎస్) ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్, ఎంబీఏ (సీబీసీఎస్) మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి, ఈ నెల 15వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 15వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చాలెంజ్ ఎవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోదలిచిన వారు ఒక్కో పేపర్‌కు రూ.10000 చొప్పున చెల్లించి 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఎంఏ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కోర్సుల సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాల కోసం www.osmania.ac.inలోచూసుకోవచ్చన్నారు.

నేడు చేపమందు పంపిణీ

సిటీబ్యూరో/అబిడ్స్, సుల్తాన్‌బజార్, జూన్ 7 : మృగశిర కార్తెను పురస్కరించుకొని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో శనివారం బత్తిని కుటుంబం చేప ప్రసాదం పంపిణీ చేయనున్నది. ఈ నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. చేప ప్రసాదాన్ని స్వీకరించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ఆస్తమా వ్యాధిగ్రస్తులు ఇప్పటికే ఎగ్జిబిషన్ మైదానానికి చేరుకున్నారు. టోకెన్లు కొనుగోలు చేసి..మైదానంలోనే సేద తీరుతున్నారు. ఈ నేపథ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు అన్నదానాలు చేస్తున్నాయి. ఎగ్జిబిషన్ మైదానంలో నేడు తెల్లవారుజాము నుంచి మరుసటి రోజు ఉదయం వరకు చేప ప్రసాదం పంపిణీ ఉంటుందని, ఈ నేపథ్యంలో రెండు రోజుల పాటు పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ అదనపు సీపీ వెల్లడించారు.